క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 17న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. అశోకకాలనీ, పోచమ్మగుడి, విద్యానగర్, గోకుల్‌నగర్, వాజ్‌పేయి కాలనీ, వికాస్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, లోటస్ కాలనీ, హనుమాన్ జంక్షన్, కేఎస్ఆర్ గార్డెన్, దత్తక్షేత్రం, ఎస్ఎస్ఆర్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. గౌతంనగర్, ములుగు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సు

కాజీపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు సోమవారం ముగిశాయి. కడిపికొండ గ్రామంలో చివరి రోజు దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు 232 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ భావ్‌సింగ్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ప్రణయ్, ఆర్ఐ కృష్ణ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



హన్మకొండ / నయీంనగర్: హనుమకొండ గుడిబండల్‌కు చెందిన బైరి నితిన్ కుమార్ ముదిరాజ్ అనుమానాస్పదంగా మృతిచెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులకు ముదిరాజ్ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ నాయకులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్, ఉపాధ్యక్షుడు గోనెల విజేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ 60 మంది మెపా బాధ్యుల ద్వారా విరాళాలు సేకరించి రూ.30 వేల సాయాన్ని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి, నాయకులు సింగారపు రామకృష్ణ, నీరటి రాజు, గోనెల విజేందర్, మండల సమ్మయ్య, పులి మహేష్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



రామన్నపేట: న్యూస్‌పేపర్ కొనుక్కొని వస్తానని చెప్పి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపిన వివరాల ప్రకారం గోపాలస్వామి సర్కిల్ సమీపంలో అద్దెకు ఉంటున్న రామగిరి వెంకటయ్య ఈనెల 15న మధ్యాహ్నం సమయంలో న్యూస్‌పేపర్ కొనుక్కొని వస్తానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. వెంకటయ్యకు కాస్త మతిస్థిమితం ఉందని, ఫిట్స్ కూడా వచ్చేదని కుటుంబీకులు తెలిపారు. ఎంత వెతికినా వెంకటయ్య ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ఆచూకీ తెలిస్తే 87126 85117, 87126 85005 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కేటీఆర్‌ను కలిసిన హరిరమాదేవి



వరంగల్: బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను పార్టీ నాయకురాలు డాక్టర్ హరిరమాదేవి సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫార్ములా వన్ రేసు వ్యవహారంలో ఏసీబీ ఎదుట విచారణకు హాజరుకావడానికి ముందు బీఆర్ఎస్ నాయకులతో కలిసి కేటీఆర్‌కు సంఘీభావం ప్రకటించినట్లు ఆమె తెలిపారు.

శ్రీపాల్‌రెడ్డి సేవలు మరువలేనివి

హన్మకొండ: రెవెన్యూ శాఖలో కర్రె శ్రీపాల్‌రెడ్డి అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొనియాడారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని శ్యామల గార్డెన్‌లో హనుమకొండ తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి సంతాప సభ సోమవారం జరిగింది. ముందుగా శ్రీపాల్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యేతో పాటు, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు, బంధు మిత్రులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తహసీల్దార్‌గా హనుమకొండలో శ్రీపాల్‌రెడ్డి తనదైన ముద్ర వేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు చాడ సునీల్ రెడ్డి, హనుమారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రజనీకర్ రెడ్డి, విజయపాల్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

యూ టర్న్ కావాలి

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు, ప్రయాణికులు
- భీమారం జంక్షన్‌లో మూసివేసిన మార్గాన్ని తెరిపించాలని వేడుకోలు



మూసివేసిన యూ టర్న్ మార్గం

హసన్‌పర్తి: హనుమకొండ – కరీంనగర్ ప్రధాన రహదారిలోని భీమారం జంక్షన్ వద్ద రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనదారుల సంఖ్య అధికమైంది. దాంతో ఎదురెదురుగా వాహనాలు ఢీకొని రోడ్డు ప్రమాదాలు జరిగి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈక్రమంలో భీమారం సెంటర్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అప్పుడే బాగుండేది

హనుమకొండ – కరీంనగర్ ప్రధాన రహదారి నిర్మాణంలో భాగంగా భీమారం సెంటర్ వద్ద గతంలో యూ టర్న్ ఏర్పాటు చేశారు. దీంతో ఎర్రగట్టు గుట్టు వైపు నుంచి వచ్చే వాహనదారులు యూ టర్న్ తీసుకుని భీమారం గ్రామంలోకి, అలాగే భీమారం గ్రామం నుంచి యూ టర్న్ తీసుకుని హనుమకొండ వైపునకు వెళ్లేవారు. దాంతో ఆ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా వ్యాపారం కూడా లాభసాటిగా జరిగేది.

రద్దీగా మారడంతో..

యూ టర్న్ వద్ద వాహనాల తాకిడి ఎక్కువకావడంతో ఆ ప్రాంతం రద్దీగా మారింది. దాంతో ఈ మార్గాన్ని పోలీసులు మూసివేశారు. దాంతో సమస్య మరింత జఠిలమైంది. భీమారం గ్రామం నుంచి హనుమకొండకు వెళ్లే వారు రాంగ్ రూట్‌లో పలివేల్పుల క్రాస్ వద్దకు వెళ్లి యూ టర్న్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చే వాహనదారులు ఇబ్బందులకు గురుకావడమే కాకుండా ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి.

ఆ మార్గాన్ని తెరిపించాలి



మూసివేసిన యూ టర్న్ మార్గాన్ని వెంటనే తెరిపించాలి. ఈ మార్గం మూసివేయడం వల్ల వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపారాలు కూడా లాభసాటిగా సాగడం లేదు. పోలీస్ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

\- సంగాల విక్టర్‌బాబు, భీమారం

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి



యూ టర్న్ మార్గాన్ని మూసివేయడం వల్ల చాలా దూరం వెళ్లి తిరిగి రావాల్సి వస్తోంది. ఈక్రమంలో భీమారం జంక్షన్‌ను అభివృద్ధి చేయాలి. వాహనదారుల తాకిడి నివారణకు ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి. ఈ విషయమై అధికారులు సత్వరమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

\- పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, భీమారం

కలెక్టర్ స్నేహకు శుభాకాంక్షల వెల్లువ



హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీజీఓ నాయకులు



కలెక్టర్ స్నేహ శబరీష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న 108 ఉద్యోగులు



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీడీఓల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, చిత్రంలో జెడ్పీ సీఈఓ విద్యాలత, తదితరులు

భద్రతా ప్రమాణాలు పాటించాలి



మృతి చెందిన విద్యుత్ ఉద్యోగులకు మౌనం పాటిస్తూ నివాళి అర్పిస్తున్న ఉద్యోగులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులు భద్రతా ప్రమాణాలు పాటించాలని హనుమకొండ సర్కిల్ కార్యాలయం డీఈ (టెక్నికల్), భద్రతా అధికారి ఎ.విజేందర్ రెడ్డి సూచించారు. ఇటీవల మృతి చెందిన మెట్‌పల్లి డివిజన్ వల్లొండ సెక్షన్ ఏఎల్ఎం దంపేట రాజేశం, డోర్నకల్ ఏఎల్ఎం క్రాంతికి హనుమకొండ నక్కలగుట్టలోని హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ అధికారులు, ఉద్యోగులు సోమవారం 2 నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా విజేందర్ రెడ్డి మాట్లాడుతూ విధుల్లో ఉన్నప్పుడు భద్రతా పరికరాలు వాడాలన్నారు. అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాలు పోగొట్టుకోవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నవీన్ కుమార్, ఏడీఈలు, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: మావోయిస్టులు, ఆదివాసీలపై ఆపరేషన్ కగార్ పేరుతో కొనసాగుతున్న హత్యాకాండను నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు డిమాండ్ చేశారు. ఈనెల 17న జరగనున్న మహాధర్నా వాల్‌పోస్టర్లను హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయంత్, పాణి, భారత్ బచావో నాయకులు వెంగల్ రెడ్డి, ఓంబ్రహ్మం, శంకర్‌రావు, రాంబ్రహ్మం, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ చంద్రకళ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి



దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

కాజీపేట రూరల్: 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. కాజీపేట 47వ డివిజన్ ఇంపీరియల్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ కాజీపేట మండల కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ కాజీపేట మండల అధ్యక్షుడు రొంటాల కోటేశ్వర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అకిళ్ల వెంకటస్వామి, సతీష్, భాస్కర్, సుధాకర్, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



కాజీపేటలో మాట్లాడుతున్న శ్రీదేవి

కాజీపేట: ప్రతిఒక్కరూ మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. కాజీపేట ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ శిశు, మహిళ సంక్షేమ శాఖతో కలిసి సఖి సెంటర్ బాధిత మహిళలు, బాలికలకు ఐదు రకాల సేవలు అందిస్తున్నట్లు వివరించారు. సఖి సెంటర్ 24 గంటల పాటు పని చేస్తుందని అన్నారు. బాధిత మహిళలు 181, 1098, 0870 2452112, 73829 83088 నంబర్లకు కాల్ చేసి తక్షణ సహాయం పొందాలని సూచించారు. ఈ మేరకు సఖి సెంటర్ సేవల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఓ శ్రీనివాస్, అనూష తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు



గొడుగు బహూకరిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

హసన్‌పర్తి: రెండు వేల క్లబ్‌లు, లక్ష మంది సభ్యులతో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ తెలిపారు. డౌన్‌టూ డెస్క్‌లో భాగంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రంలో సోమవారం పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హసన్‌పర్తి మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయం, బాల వికాస వాటర్ ప్లాంట్ల వద్ద సిమెంట్ బెంచీల ఏర్పాటు, విద్యార్థులకు నోట్ బుక్స్, చిరు వ్యాపారులకు గొడుగులు అందించినట్లు వివరించారు. తొలుత ఎర్రగట్టు దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథి సత్యనారాయణ, వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి నాగభూషణం, రీజియన్ చైర్మన్ రవీందర్, నాయకులు అప్పని శంకర్, గౌరిశెట్టి కృష్ణమూర్తి, నాగమళ్ల మాధవ శంకర్, చిదర పురవర్ధన్, భీష్మనాథం, శ్యాంసుందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థికి బ్యాగు, నోట్‌బుక్స్ అందిస్తున్న ఎంఈఓ

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని షేర్‌పురా ఇస్లామియా ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయుల సహకారంతో రూ.75 వేల విలువగల నోట్‌బుక్స్, బ్యాగులు, స్టడీ మెటీరియల్‌ను ఎంఈఓ గంప అశోక్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఎంఏ.ఖాలిక్ తన్వీర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇస్లామియా సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్ మహ్మద్ హుస్సేన్‌పాషా మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని అన్నారు. కార్యక్రమంలో సయ్యద్ మొహిసినొద్దీన్, మహ్మద్ యాఖూబ్, షరీఫ్, నయీమొద్దీన్, నైమతుల్లాఖాన్, ఖాజాభద్రుజ్జమా, మేరాజ్‌బాను, ఖలిదా బేగం, ఇఫత్ ఫాతిమా, ఆసిమున్నీసా, అబేదాబేగం, నఫీస్‌సుల్తానా పాల్గొన్నారు.

వాటర్ కూలర్ బహూకరణ



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న జనార్దన్

వరంగల్ లీగల్: హనుమకొండ జిల్లా కోర్టులోని మహాత్మాగాంధీ హాల్‌కు రూ.60 వేల విలువగల వాటర్ కూలర్‌ను సీనియర్ న్యాయవాది కొక్కొండ రమేష్ బహూకరించారు. ఆ కూలర్‌ను రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు వలుస సుధీర్, పులి సత్యనారాయణ, కార్యదర్శులు రమాకాంత్, రవి, ఉపాధ్యక్షుడు జయపాల్, కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు ఎల్లమ్మతల్లి ఉత్సవాలు

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని రేణుకఎల్లమ్మ తల్లి ఉత్సవాలను మంగళవారం నిర్వహించడానికి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. గౌడ కులస్తుల ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో డప్పు, వాయిద్యాలు, శివసత్తుల నృత్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించనున్నారు. ఆలయ అర్చకుడు శంకర్‌శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి.

వయోవృద్ధులకు ఉచిత న్యాయ సహాయం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే



సదస్సులో మాట్లాడుతున్న క్షమాదేశ్ పాండే

హన్మకొండ: వయోవృద్ధులు ఉచిత న్యాయ సలహా పొందేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని ఆ సంస్థ కార్యకార్శి, సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే సూచించారు. హనుమకొండలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వయో వృద్ధులు తమ కుటుంబ సభ్యులతో అనేక రకాల వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ సభ్యురాలు అనితారెడ్డి మాట్లాడుతూ తమ పిల్లలకు ఆస్తులు పంపిణీ చేసిన తర్వాతే పెద్దలపై వేధింపులు పెరుగుతున్నాయని అన్నారు. జిల్లా సంక్షేమాధికారి జయంతి మాట్లాడుతూ వయోవృద్ధుల రక్షణకు తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంరక్షణ చట్టం -2007 ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో హెల్పేజ్ ఇండియా రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్యాంకుమార్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగందర్, వల్లంపట్ల నాగేశ్వర్ రావు, అంచూరి చంద్రమౌళి, చంద్రజిత్ రెడ్డి, దామెర నర్సయ్య, నర్సయ్య, మార్క రవేందర్ గౌడ్, తాడూరి లక్ష్మి నారాయణ, గంగారపు యాదగిరి, రాజేందర్, గంటి సాంబయ్య, చిదురాల సత్యనారాయణ, కజాంపురం దామోదర్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

నయీంనగర్: ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కలలు సాకారం అవుతున్నాయని, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. 53వ డివిజన్ లష్కర్ సింగారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిజమైన సంక్షేమ పాలన అమలవుతోందని అన్నారు. నిరుపేదల సొంతింటి కల సాకారం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. 53వ డివిజన్‌లో పేదలు అధికంగా ఉన్నారని, ఇక్కడి వారికి అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి ఎవరైనా డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే సమాచారం అందించిన వారికి రూ.25 వేల బహుమతి ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబాయ్, ఎర్ర కావ్య మహేందర్, అజీజ్ రహీమున్నీసా, ప్రవీణ్, అనిల్‌కుమార్, శ్యామ్, చందు, కాసీం, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా కేటాయిస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. హసన్‌పర్తి మండలంలోని 15 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. తమ ప్రభుత్వం మాట మీద కట్టుబడి ఉందని చెప్పారు. ఇళ్ల మంజూరుతో పేదల కళ్లల్లో ఆనందం చూస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, మేర్గు రాజేష్, గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మదన్‌గౌడ్, భగత్, చిర్ర సుమలత, జనగాని ధనలక్ష్మి, భూక్య రాజునాయక్, సౌరం చరణ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నగరంలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాలి



విద్యారణ్యపురి: వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా నగరం నడిబొడ్డున సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌నకు కేటాయించిన స్థలంలో నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్‌కుమార్ కోరారు. ఈమేరకు జిల్లా బాధ్యులతో కలిసి హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి వైవీ.గణేష్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, మోక్షాజ్ఞ, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను విధుల నుంచి తొలగించాలి

న్యూశాయంపేట: అనుమతి లేని పాఠశాలలకు పరోక్షంగా సహకరిస్తున్న వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్‌బీ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో నాయకులు హకీం నవీద్, గడ్డం నాగార్జున, ఎల్.శరత్, చుక్క ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఖిలా వరంగల్: యోగా సాధనతో ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండవచ్చని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయూష్ వరంగల్ ఇన్‌చార్జ్ డాక్టర్ మైదం రాజు సూచించారు. ఈ మేరకు వరంగల్ శంభునిపేట మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రాంగణంలో సోమవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లి నీలమ్మ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేవతి, మీనాజీ బేగం, ఫార్మసిస్టు రవీందర్, రజిత, ఇన్‌స్పెక్టర్ వశిష్ఠ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులతోనే ప్రజలకు రక్షణ

న్యూశాయంపేట: కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజలకు రక్షణ ఉంటుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు అన్నారు. పలివేల్పుల గ్రామానికి చెందిన 40 కుటుంబాలు సీపీఐలో సోమవారం చేరాయి. ఈ సందర్భంగా పార్టీ హనుమకొండ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు ఎన్.జ్యోతి, కరుణాకర్, తోట భిక్షపతి, ఎల్లేశ్, స్టాలిన్, శ్రీనివాస్, వెంకట్రాజం, ఎం.భిక్షపతి, శంకర్‌నాయక్, సుదర్శన్ పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి

ఖిలా వరంగల్: అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ ఏసీరెడ్డి నగర్‌లో ఎండీ.జరీనా ఆధ్వర్యంలో రేషన్ కార్డులపై సోమవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు ఇస్తామని చెప్పి పేదలను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఊరెళ్ల రాధ, పసునూటి లక్ష్మి, ప్రతాపగిరి నీల, సదయ్య, దివ్య, రమ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

ఖిలా వరంగల్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లకు చెందిన లబ్ధిదారులు అందుకున్నారు. ఈ మేరకు వరంగల్ ఓసిటీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, ముస్కమల్ల అరుణ, గుండు చందన, పల్లం పద్మ నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో బోగి సురేష్, ముస్కమల్ల సుధాకర్, గుండు పూర్ణచందర్, పల్లం రవి, నాయకులు పాల్గొన్నారు.

44వ డివిజన్‌లో..

కాజీపేట అర్బన్: నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తోందని కాంగ్రెస్ 44వ డివిజన్ అధ్యక్షుడు రాజారపు స్వామి తెలిపారు. కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన చిట్యాల మమత – రమేష్‌కు ఇంటి మంజూరు పత్రాన్ని అందజేసి, ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు.

రాజేందర్‌కు సహృదయానుబంధ పురస్కారం

విద్యారణ్యపురి: సహృదయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ ప్రతియేటా అందించే, ప్రముఖ కవి, సహస్రావధాని రాళ్లబండి కవితా ప్రసాద్ స్మారకంగా ఇచ్చే సహృదయానుబంధ పురస్కారాన్ని ప్రముఖ కవి, రచయిత మంగారి రాజేందర్‌రెడ్డికి ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు గిరిజా మనోహర బాబు, వనం లక్ష్మీకాంతరావు సోమవారం తెలిపారు. ఈనెల 18న హనుమకొండలోని వడ్డేపల్లిలోని పీఆర్ రెడ్డి భవన్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ, జాతీయ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి మావుడూరి సూర్యనారాయణ మూర్తి హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

కారు – ఆటో ఢీ.. పలువురు గాయాలు

మామునూరు: కారు ఢీకొట్టడంతో పంట పొలాల్లోకి ఆటో దూసుకెళ్లి బోల్తాపడింది. దాంతో ఆటో డ్రైవర్‌తోపాటు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం ఖిలా వరంగల్ మండలం మామునూరు చెరువు కట్ట వద్ద జరిగింది. డ్రైవర్ బాబుతోపాటు ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు కాగా, స్థానికులు వెంటనే వైద్య పరీక్షల నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి మామునూరు ఎస్సై కృష్ణవేణి చేరుకుని వివరాలు సేకరించారు.